క్లుప్తంగా

పెద్దకోట్ల చౌడేశ్వరీ దేవికి పూజలు



అలంకరణలో చౌడేశ్వరీ దేవి

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలకు ఉమ్మడి జిల్లా వాసులేకాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి కానుకలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు



అలంకరణలో పెద్దమ్మ తల్లి

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరులో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. పంటలు బాగా పండాలని కోరుతూ మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చౌడేశ్వరీ దేవతకు..

అమడగూరు: మండలంలోని రెడ్డివారిపల్లి మహిళలు చౌడేశ్వరీ అమ్మ వారికి ఆదివారం బోనాలను సమర్పించారు. ఏటా ఏప్రిల్‌లో జరిగే అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు అమ్మవారికి బోనాలను సమర్పించేవారు. అయితే కొన్ని అనివార్య కారణాల వలన అప్పట్లో సమర్పించని కారణంగా గ్రామపెద్దల నిర్ణయం మేరకు బోనాలను సమర్పించారు. ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం జంతుబలులు ఇచ్చారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

క్రికెట్ టోర్నీ విజేత గొట్లూరు జట్టు



విజేతగా నిలిచిన గొట్లూరు జట్టు సభ్యులు

ధర్మవరం రూరల్: రామగిరి మండలం పోలేపల్లిలో నిర్వహించిన జై జవాన్ క్రికెట్ టోర్నీ విజేతగా గొట్లూరు జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత గొట్లూరు జట్టు కంబదూరు జట్టుతో తలపడగా నిర్ణీత 20 ఓవర్లలో 151 పరుగులు సాధించింది. అనంతరం లక్ష్య ఛేధనకు దిగిన కంబదూరు జట్టు 103 పరుగులకే ఆల్ అవుట్ కావడంతో గొట్లూరు జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. గొట్లూరు జట్టులో రామాంజినేయులు 46 పరుగులు, చైతన్య 31 పరుగులు సాధించి విజయంలో కీలకపాత్ర పోషించారు. విజయం సాధించిన గొట్లూరు జట్టును వైఎస్సార్‌సీపీ నేత గొట్లూరు మారుతి అభినందించారు.

తాడిమర్రిలో భారీ వర్షం

తాడిమర్రి: ఎండ వేడిమి, తీవ్రమైన వడగాలుల నుంచి తాడిమర్రి వాసులకు ఉపశమనం కలిగింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి దట్టమైన మేఘాలు కమ్ము కోవడంతో భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచాయి. వర్షం కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతాయని ప్రజలు చెబుతున్నారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: బడుగు బలహీన వర్గాలను గుర్తించి అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండకమర్ల గ్రామ సచివాలయం-2 పరిధిలోని పీ.కొత్తపల్లిలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు హారతులు, పూలతో సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి పొందారో తెలియచేస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు అందజేస్తామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, పేద ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నను ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి 2024లో మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఫర్వీన్‌బాను, జెడ్పీటీసీ కుర్లిదామోదర్‌రెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, సర్పంచ్ శ్రావణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు నిసార్ అహమ్మద్, మాజీ సర్పంచ్ మారెన్న, నాయకులు జైపాల్‌రెడ్డి, శరణ్‌కుమార్ రెడ్డి, సుబ్బిరెడ్డి, వెంకటనారాయణ, నరేష్ రెడ్డి, జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, మధుసూదనరెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ పోలప్ప పాల్గొన్నారు.



పీ.కొత్తపల్లిలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

మెడిటేషన్‌తో మానసిక ఒత్తిడి దూరం

కొత్తచెరువు: మెడిటేషన్‌తో మానసిక ఒత్తిడిని జయించవచ్చని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని దర్గావీధిలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఓం శాంతి వారు ఏర్పాటు చేసిన నూతన మెడిటేషన్ సెంటర్‌ను సందర్శించారు. మెడిటేషన్ తదితర విషయాలను బ్రహ్మకుమారి ఆదిలక్ష్మి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ప్రతి మనిషి ఒత్తిడికి గురువుతున్నాడన్నారు. ఒత్తిగి ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని తెలిపారు. ఇటువంటి వాటిని అధిగమించాలంటే మెడిటేషన్ తప్పనిసరి అన్నారు. మెడిటేషన్‌తో మానసిక ప్రశాంతత అలవర్చుకోవచ్చన్నారు. బ్రహ్మకుమారీలు ఇటువంటి మెడిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మండలంలోని లింగారెడ్డి పల్లికి చెందిన విశ్వనాథ్ కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నాగభూషణ, ఎంపీటీసీ సాంబశివారెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, నాయకులు దాల్‌మిల్ సూరి, నాగరాజు, షాన్‌షేట్, టౌన్ కన్వీనర్ వడ్డె భాస్కర్, సుబ్బారావు, యల్లప్ప, జాకీర్, చలపతి, మారుతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్ల సచివాలయం-2 పరిధిలోని మురికినీల్లతండా, ఎస్.కొట్టాల, శేషయ్యగారిపల్లి, శేషయ్యగారిపల్లి తండాలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్లకృష్ణారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, సర్పంచు శ్రావణి ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలు పాల్గొనాలని కోరారు.

శుభకార్యం

నల్లమాడ: మండలంలోని అప్పయ్యగారి పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దుద్దుకుంట రెడ్డెప్ప రెడ్డి కుమార్తె దివ్య వివాహం వినోద్‌రెడ్డితో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

తలుపుల: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రఫీనాయక్, ఎంపీడీఓ రామానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి హాజరవుతారన్నారు. వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ పాలన

- నూతన సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్పీకుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందడంతో పాటు, మారుమూల గ్రామాల్లో సైతం ఆదర్శవంతంగా అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కొనియాడారు. ఆదివారం మండల పరిధిలోని ధనియానిచెరువు గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంతో పాటు రూ.21.80 లక్షలతో నిర్మించిన నూతన ఆర్బీకే భవనాన్ని ప్రారంభించారు. పూజలు నిర్వహించిన అనంతరం సచివాలయంలో నిర్మించిన వివిధ గదులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఇకపై మండల కేంద్రాల చుట్టూ తిరిగాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సచివాలయం ద్వారా 34 శాఖలకు సంబంధించిన 500 సేవలు అందుతాయని తెలిపారు. ప్రజలకు ఎప్పుడు ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా గ్రామ సచివాలయం నుంచే వారి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గత టీడీపీ పాలనలో అర్హులైనప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలంటే అధికారులు, నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగడమే కాకుండా లంచం ఇవ్వనిదే ఏ పని జరిగేది కాదని గుర్తు చేశారు. సమస్యపై అర్జీలు ఇచ్చినా అవి చెత్తకుప్పల్లో వేయడం జరిగేదని విమర్శించారు. కానీ ఇప్పుడు అటువంటి దౌర్భాగ్య పరిస్థితి లేదన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి, వాటిని పరిష్కరించడానికి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వ పాలన మరింత చేరువ చేశారని వెల్లడించారు.



సచివాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

అభివృద్ధి పథంలో గ్రామాలు..

గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు అంటే ఒక పాఠశాల, ఒక పంచాయతీ కార్యాలయం మాత్రమే ఉండేవని, అవి కూడా పాడుబడిపోయిన రూపాలతో దర్శనమిచ్చేవని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత మారుమూల పల్లెల్లో సైతం అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, సుమారు 4.5 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రపంచంలో ఇప్పటి వరకు ఎవరూ సాధించని ఘనతను రాష్ట్ర ముఖ్యమంత్రి సాధించారన్నారు. గ్రామ స్వరాజ్య సాధన దిశగా పూర్తిస్థాయిలో ప్రభుత్వం సంస్కరణలు చేపట్టిందన్నారు. వందల కోట్ల రూపాయలు వెచ్చించి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలను నిర్మిస్తూ పారదర్శకంగా సంక్షేమాన్ని ప్రజలకు చేరువచేస్తోందని చెప్పారు. అనంతరం సచివాలయ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసిన నిర్మాణ సహాయకుడు శివారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పృథ్వీలను సత్కరించారు. అలాగే ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యేను సర్పంచ్ దిల్షాద్ దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం సచివాలయ, ఆర్బీకే ప్రాంగణంలో పంచాయతీ కార్యదర్శి ఉమారాణి, ఏఓ లోకేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, స్థానిక సర్పంచ్ దిల్షాద్, బీసీ నేత బాలకృష్ణ నాయుడు, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీటీసీలు తిమ్మారెడ్డి, కొత్తరంగారెడ్డి, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఆర్బీకే చైర్మన్ గంగిరెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, వాటర్ షెడ్ చైర్మెన్లు కృష్ణారెడ్డి, బయారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జయరామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, స్థానిక నాయకులు అల్లాబక్షు, చెన్నకృష్ణారెడ్డి, తిరుమల నాయుడు, విశ్రాంత వీఆర్‌ఓ ఓబుళరెడ్డి, శేఖర్ నాయుడు, సామిరెడ్డి, నారాయణస్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్ల, నాయనాకోటతండా, మామిళ్లకుంట్లపల్లి, టీ.కుంట్లపల్లి గ్రామాల్లో పలు కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. కొండకమర్ల గ్రామానికి చెందిన ఎద్దుల మల్లికార్జునరెడ్డి తల్లి నాగలక్ష్మమ్మ (75) ఆదివారం మృతి చెందింది. ఆమె మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం నాయనాకోట తండాలో సుగంధర్ నాయక్ అన్న ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో అక్కులప్ప నాయక్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మామిళ్లకుంట్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ చింతా రామచంద్రారెడ్డి కాలు విరగడంతో ఆయన్ను పరామర్శించారు. అక్కడి నుంచి టీ.కుంట్లపల్లిలో మాజీ డీలర్ చలపతినాయుడు తల్లి నారమ్మ (80) ఆదివారం మృతి చెందడంతో కుటుంబాన్ని ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు, మండల అగ్రిబోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు నిషార్ అహమ్మద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి నాయకులు మాజీ సర్పంచ్ మారెన్న, దుర్గాప్రసాద్‌నాయక్, వెంకటనారాయణ, రమణ, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



కొండకమర్లలో నాగలక్ష్మమ్మకు పూలమాలతో నివాళులర్పించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి తోటలు

కనగానపల్లి: మండలంలోని బద్దలాపురం, యలకుంట్ల గ్రామాల్లో ఈదురు గాలులతో అరటి తోటలు నేలకొరిగాయి. దీంతో రూ.లక్షల్లో పంట నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు. మండలంలోని పలుచోట్ల శనివారం రాత్రి ఈదురు గాలులతో పాటు వర్షం కురిసింది. వీటి వల్ల బద్దలాపురం గ్రామంలోని చంద్రాయుడు, అమృతమ్మ, చిన్నికృష్ణారెడ్డి, నవీన్‌రెడ్డి రైతులకు చెందిన 23 ఎకరాల్లోని అరటి తోటలు నేలకొరిగాయి. దీంతో సుమారు రూ. 25 లక్షల దాకా పంట నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు. వీటితో పాటు యలకుంట్ల, నెమలివరం గ్రామాల్లో కూడా పలుచోట్ల అరటి తోటలు దెబ్బతిన్నాయని స్థానిక రైతులు తెలిపారు. పంటలను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నాయకులు: ఈదురు గాలులతో దెబ్బతిన్న అరటి తోటలను స్థానిక హార్టికల్చర్ అధికారులతో కలసి మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటరాముడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపి, బాధిత రైతులకు పంట నష్ట పరిహారం వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, వీహెచ్‌ఏ ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, హార్టికల్చర్ సిబ్బంది

హెచ్‌ఐవీపై అవగాహన

కదిరి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా డీఎంహెచ్ఓ ఆదేశాలతో జనజాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవం నిర్వహించారు. కదిరి ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ హరికీర్తన మాట్లాడుతూ.. హెచ్ఐవీ వ్యాధి ఇతరులకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఆర్‌టీ మందులు ఎక్కడ దొరుకుతాయి? హెచ్ఐవీ సోకిన గర్భవతి నుంచి బిడ్డకు రాకుండా మందులు ఉపయోగించి ఎలా రక్షించుకోవాలో ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు.

ఆశ్రమానికి ఉచితంగా బోరు

అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మాతృశ్రీ వృద్ధాశ్రమానికి తనకంటిపల్లికి చెందిన విజయలక్ష్మి, రామ్మోహన్ దంపతులు ఉచితంగా బోరు వేయించారు. ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి విన్నపం మేరకు బోరు వేయించగా నీరు పుష్కలంగా పడ్డాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, నక్కలచిన్నప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, రమేష్, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి దేవరెద్దు వేల్పు



దేవరెద్దుకు పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి



వేల్పుకు హాజరైన జనం

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల గ్రామ సమీపంలోని పాలవాండ్లపల్లిలో లక్ష్మీ నరసింహ స్వామి దేవరెద్దు వేల్పును ఆదివారం వైభవంగా నిర్వహించారు. కదిరి పరిసర మండలాల నుంచి వచ్చిన 8 దేవరెద్దులను ప్రత్యేకంగా అలంకరించి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేల్పులో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొని దేవరెద్దులకు ప్రత్యేక పూజలు చేశారు. వేల్పును ఆచార్యకర్తలు శ్రీనివాసాచార్యులు, కదిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వారు జరిపించారు. వేల్పుకు వచ్చిన వారికి సురతాని సుమతి, వి.శ్రీనివాసులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, సర్పంచ్ ఆంజనేయులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రవీంద్రానాయక్, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

రామగిరి: మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

తాడిమర్రి: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిమర్రి, పెద్దకోట్ల, పిన్నదర్రి, నార్పింపల్లి, దాడితోట, చిల్లవారిపల్లి తదితర గ్రామ సచివాలయాలతో పాటు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవచ్చన్నారు.

నివాళి



టీచర్ శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని జోగన్నపేట గ్రామానికి చెందిన బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ధనుంజయ సోదరుడు టీచర్ శ్రీనివాసులు (45) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మృతుడి గ్రామానికి వెళ్లి టీచర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



కంపెనీ ప్రతినిధులకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిర్వహించే అన్నదాన పథకానికి శ్రీ లక్ష్మీ నరసింహ కన్‌స్ట్రక్షన్స్ బెంగుళూరు వారు ఆదివారం రూ.1,50,000 విరాళాన్ని ఆలయ చైర్మన్ గోపాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు కంపెనీ ప్రతినిధులకు ప్రసాదం, స్వామి శేషవస్త్రం అందజేశారు. శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.

రాజీవ్ గాంధీకి నివాళి

కదిరి అర్బన్: భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షాన్‌వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాలకృష్ణ యాదవ్, అక్రమ్, అశ్రాఫ్, ఇమ్రాన్, బాబా, సాధిక్ పాల్గొన్నారు.

రెండు కార్ల ఢీ.. ఆరుగురికి గాయాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): బళ్లారి- బెంగళూరు జాతీయ రహదారిలోని డి హీరేహాళ్ మండల కేంద్రం పోలీస్‌స్టేషన్ సమీపాన ఆదివారం వేకువజామున రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ కారు నుజ్జయింది. వివరాలు.. బెంగళూరు నుంచి బళ్లారి వైపు ఓ కారు వెళ్తుండగా, వెనుక నుంచి మరో కారు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో ముందు కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడగా, వెనుక కార్లో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక ఫెర్రర్ కాలనీకి చెందిన వరప్రసాద్ అలియాస్ వరాలు అనే చీటర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి ఆదివారం తెలిపారు. తపోవనానికి చెందిన శివమ్మ అనే మహిళకు ఇంటి స్థలం ఇప్పిస్తానని చెప్పి రూ. 2 లక్షలు తీసుకున్నాడు. సంబంధం లేని స్థలాన్ని ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. తీరా స్థలం అతనిది కాదని తెలియడంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. రూ. 2 లక్షలు తీసుకొని మహిళను మోసగించిన నేరం కింద అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కదిరి టౌన్: స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కదిరి సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు డీఎస్పీ శ్రీలత కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవనం సాగించాలని సూచించారు.